క్లుప్తంగా

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : బహుజనుల సాధికారత కోసం దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని ఎస్‌డీపీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్లా బేగ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో కుల గణన డిమాండ్‌తో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కుల గణన చేపట్టి ఆయా సామాజిక వర్గాలకు దమాషా పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్‌మియ్యా, సభ్యులు చాంద్‌బాషా పాల్గొన్నారు.

డిసెంబర్ 3న రజక గర్జన



కరపత్రాలను విడుదల చేస్తున్న రజకులు

కర్నూలు(సెంట్రల్) : డిసెంబర్ 3వ తేదీన తాడేపల్లిగూడెంలో జరిగే రజక గర్జనకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం రజక గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ కల్లూరులోని చాకిరేవులో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో రజకులు కుల వివక్షతను ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో సి.శేషాద్రి, నాగరాజు, అంజి, ఈరన్న, జమ్మన్న, పెద్ద జమ్మన్న, బాబు, మధు, పుల్లయ్య, రాముడు, శ్రీరాములు పాల్గొన్నారు.

అతిసార బాధితులకు పరామర్శ



అతిసార బాధితులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో అతిసార ప్రబలి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి. నిర్మల, కేవీ నారాయణ మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే గ్రామంలో అతిసారతో ప్రజలు ఆసుపత్రుల పాలయ్యారని విమర్శించారు. గ్రామప్రజలకు శుభ్రమైన తాగునీటిని అందించలేకపోవడం వల్లే వారు హంద్రీనీటిని తాగి ఆసుపత్రి పాలయ్యారని ఆరోపించారు.

ఆర్‌యూ ఇన్‌చార్జ్ వీసీకి సన్మానం



ఆర్‌యూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఫజులుర్ రెహమాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వీసీ, రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఫజులుర్ రెహమాన్‌కు సోమవారం ఘనంగా సన్మానించారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆరిఫ్ ఖాన్, తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ మండి అన్వర్ హుసేన్‌లు సోమవారం ఆర్‌యూలో ఇన్‌చార్జ్ వీసీని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉస్మానియా కళాశాల పూర్వ విద్యార్థి అయిన ఆచార్య ఫజలుర్ రెహమాన్ ఉన్నతమైన పదువుల్లో రాణించడం కర్నూలుతో పాటు ఉస్మానియా కళాశాలకు గర్వకారణమన్నారు.

కొత్తపేట రైతుబజారు ఎస్టేటు ఆఫీసర్‌పై మరోసారి ఫిర్యాదు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని కొత్తపేట రైతుబజారు ఎస్టేటు ఆఫీసర్‌పై కూరగాయలు, ఆకుకూరలు, అల్లం, ఆలుగడ్డల వ్యాపారులు మరోసారి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్టేటు ఆఫీసర్ ఆగడాలను భరించలేమని, ఇక్కడి నుంచి బదిలీ చేయాలని కోరారు. ఇప్పటికే ఎస్టేటు ఆఫీసర్‌పై మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి ఏర్పాటు చేసిన టీమ్ విచారణ చేస్తుండగా మళ్లీ ఫిర్యాదు రావడం గమనార్హం. ఫిర్యాదును కలెక్టరేట్ అధికారులు మార్కెటింగ్ శాఖ ఏడీకి పంపారు. కాగా ఆయన ఈ విషయాన్ని రైతుబజార్ల సీఈవో దృష్టికి తీసుకపోతున్నట్లు తెలిపారు. కొత్తపేట రైతుబజారు నుంచి మరోచోటుకు బదిలీ చేయాలని చిరువ్యాపారులు కోరుతున్నట్లు పేర్కొన్నారు.



లక్షదీపోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ సృజన, జేసీ మౌర్య



గోవిందనామం జపిస్తున్న భక్తులు

దేదీప్యమానం..లక్ష దీపోత్సవం

- టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా కార్తీక దీపోత్సవం
- తరలివచ్చిన భక్తులు
- వేడుకలో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ఎస్‌ఏపీ క్యాంప్ మైదానంలో కార్తీక లక్ష దీపోత్సవ కార్యక్రమం దేదీప్యమానంగా సాగింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేఈఓ సదా భార్గవి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఎస్పీ కృష్ణ కాంత్ దంపతులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ దంపతులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించారు. తిరుపతి రాయలచెరువు శ్రీ శక్తి పీఠాదీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని అనుగ్రహ భాషణం చేశారు. దీపం జ్ఞానానికి సంకేతం అన్నారు. మానవుడు దానత్వం నుంచి మానవత్వం వైపుగా ఆపై మాధవత్వాభిముఖంగా నడవాలని పిలుపునిచ్చారు. కార్తికేయుడు జన్మించిన మాసం కాబట్టి ఈ మాసాన్ని కార్తీక మాసం అని పిలుస్తారన్నారు. కార్తీక పౌర్ణమి అటు శివునికి, ఇటు విష్ణుమూర్తికి ప్రియమైన రోజన్నారు. ఈ రోజున దీపం వెలిగిస్తే పాపాలన్నీ హరించుకుపోతాయన్నారు. దీప ప్రాశస్త్యం గురించి డాక్టర్ పి.వి.ఎన్.ఎస్.మారుతి, విష్వక్సేన పూజ, శ్రీనివాచార్యన, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, మహాలక్ష్మి పూజ, సామూహిక లక్ష్మీ నీరాజనం, గోవింద నామాలను వేద పండితులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థుల అష్టలక్ష్మి వైభవం నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తితిదే హిందూ ధార్మిక ప్రాజెక్ట్ అధికారి కె.రాజగోపాల్, కార్యదర్శి డాక్టర్ సోమయాజులు, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, కాటసాని నరసింహారెడ్డి దంపతులు, ఎస్‌వీబీసీ సీఈఓ షణ్ముఖ్,డీఎస్పీ విజయశేఖర్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్





వెంకటేశ్వస్వామి, లక్ష్మీదేవికి హారతులు ఇస్తున్న పురోహితులు

వెయిట్‌లిఫ్టర్లను అభినందించిన కలెక్టర్

కర్నూలు (టౌన్) : ఈనెల 17 నుంచి 19 వరకు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన 10 వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్, జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ డాక్టర్ జి. సృజన అభినందించారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని వ్యాయామ హాలులో ఈ కార్యక్రమం జరిగింది పతకాలు సాధించిన బి. వీరేష్, డి.జి. వీరేష్, అబ్దుల్లా, నరసింహ నాయక్, పర్వేజ్, ముషారఫ్, బి. నాగమణిలను కలెక్టర్ మెడల్స్ వేసి అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, కోచ్ యూసుఫ్ బాషా పాల్గొన్నారు.

శభాష్..వికాస్

కర్నూలు(సెంట్రల్): ప్యాకెట్ మనీని సైనికుల సంక్షేమనిధికి విరాళంగా ఇచ్చిన విద్యార్థి వికాస్‌ను కలెక్టర్ డాక్టర్ జి.సృజన అభినందించారు. నగరంలోని లక్ష్మీనగర్‌లో ఉన్న విద్యానికేత్ పాఠశాలలో వికాస్ ఏడో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ప్యాకెట్ మనీని ఖర్చు చేయకుండా దేశం కోసం అహర్నిశలు కష్టపడే సైనిక సంక్షేమ నిధికి విరాళం రూపంలో రూ.12,691 ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సోమవారం కాన్ఫరెన్స్ హాలులో అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షమ అధికారి రాచప్ప పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



పరుగు పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

కర్నూలు (టౌన్): క్రీడలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అన్నారు. విభిన్న ప్రతిభావంతులు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. ఆదివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అతిథిగా హాజరైన కలెక్టర్ విభిన్న ప్రతిభా వంతుల క్రీడా పోటీలను పచ్చ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు క్రీడాపోటీలు నిర్వహించేందుకు అధికారులు ఎల్లప్పుడూ ముందుండాలన్నారు. విభిన్న ప్రతిబా వంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా మాట్లాడుతూ వివిధ విభాగాల్లో షాట్‌పుట్, డిస్కస్‌త్రో, పరుగు పందెం, వాలీబాల్, మూడు చక్రాల వాహనాల పోటీలు, జావిలిన్ త్రో వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ, జిల్లా పరిషత్తు సీఈఓ నాసర రెడ్డి, డీఈఓ రంగారెడ్డి, స్టేడియం చీఫ్ కోచ్ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన ఆర్‌యూ జట్టు



విజేతగా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న రాయలసీమ యూనివర్సిటీ జట్టు

కర్నూలు (టౌన్) : రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. నగరంలోని స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహించిన వాలీబాల్, చదరంగ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఆయ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ జట్టు (వాలీబాల్), శ్రీక్రిష్ణా డిగ్రీ కళాశాల జట్టు (చదరంగం)లో విజేతలుగా నిలిచారు. వాలీబాల్ క్రీడాంశంలో పత్తికొండ డిగ్రీ కళాశాల జట్టు (ద్వితీయ స్థానం) నంద్యాల ఎస్‌ఆర్‌కే డిగ్రీ కళాశాల (తృతీయ స్థానం), సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు (నాలుగవ స్థానం), చదరంగం పోటీల్లో సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల (ద్వితీయ స్థానం), ఎస్‌ఆర్‌కే డిగ్రీ కళాశాల (తృతీయ స్థానం), రాయలసీమ యూనివర్సిటీ జట్టు (నాలుగో స్థానం)లో నిలిచాయి. విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, ప్రంశసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్, నిర్వహణ కార్యదర్శి ఆదినారాయణరెడ్డి, ఆర్‌యూ క్రీడల సమన్వయ కర్త డాక్టర్ శివకిషోర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ సమావేశాలను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐకేఎస్ ఆహ్వాన సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : డిసెంబర్ 15,16,17న కర్నూలులో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశాలకు కేరళ ఆర్థిక శాఖమంత్రి కె.బాలగోపాల్, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్ దాలే, ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఉపాధ్యక్షుడు హన్నన్‌మొల్ల ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు. సోమవారం సుందరయ్య భవన్‌లో కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం నాయకులు రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ పుల్లయ్య, కె.ప్రభాకరరెడ్డి, పి.నిర్మల, డి.గౌస్‌దేశాయ్, పీఎస్ రాధాకృష్ణ, బి.రామాంజనేయులు, కేవీ నారాయణ పాల్గొన్నారు.

ఎరుకలచెర్వులో కులవివక్షను రూపుమాపాలి



ధర్నా నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కృష్ణగిరి మండలం ఎరుకలచెర్వులో కుల వివక్షతను రూపుమాపాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలోని మాదిగలు అన్ని రకాల క్రతువులకు వినియోగించుకునే రచ్చ కట్టను ఇటీవల గ్రామానికి చెందిన రమేష్, నాగేంద్ర కూల్చివేశారన్నారు. కేవలం కుల వివక్షతోనే ఈసంఘటన జరిగిందన్నారు. 8 నెలల నుంచి ఈ అంశంపై వివాదం సాగుతున్నా అధికారులు, పోలీసులు నిర్లక్ష్యం చేయడంతోనే రచ్చకట్టను కూల్చివేశారన్నారు. వెంటనే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.విజయమ్మ, కృష్ణ, గురుస్వామి, ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని మరింత అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీకి సంబంధించి ప్రతి వారం ఇచ్చే లక్ష్యాలను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఇంకా పలు విభాగాలు ఆరోగ్యశ్రీని మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ విభాగంలో ఈ–హాస్పిటల్ పోర్టల్‌లో అప్‌లోడింగ్ ప్రాసెస్ ప్రారంభించాలని సీఎంఓలు, హెచ్‌ఓడీలను ఆదేశించారు. అన్ని అత్యవసర, క్యాజువాలిటీ కేసుల కోసం న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఉన్న 24 గంటల పాటు సీటీ స్కాన్ చేయడానికి ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్డియాలజి విభాగంలో కొత్త క్యాథలాబ్, బ్లడ్‌బ్యాంక్ ప్రారంభోత్సవానికి అందరూ హాజరుకావాలని సూచించారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ఆసుపత్రి సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ హేమనళిని, హెచ్‌ఓడీలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ శ్రీలక్ష్మీబాయి, డాక్టర్ రాధారాణి, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో ప్రబలిన అతిసారం!

- సకాలంలో స్పందించిన వైద్య సిబ్బంది
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే కాటసాని
- మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం



వైద్య శిబిరంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు పరిధిలోని 28వ వార్డు లక్ష్మీపురంలో అతిసారం ప్రబలింది. కలుషిత తాగునీటితో రెండు రోజులుగా పలువురు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. లక్ష్మీపురంలోని బీసీ కాలనీలో ఈ పరిస్థితి తీవ్రంగా ఉండటంతో అధికారులు స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆది, సోమవారాల్లో మొత్తం 76 మంది అతిసారానికి గురయ్యారు.వీరిలో 24 మందిని మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. మిగతా వారిని గ్రామంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. విషయం తెలియగానే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్య, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ లక్ష్మీపురంలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి బాధితులకు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది 24 గంటలు గ్రామంలో అందుబాటులో ఉండి అవసరమైన వారికి చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ హెల్త్ అధికారి డాక్టర్ ఉమాదేవి, డీఎస్‌ఓ డాక్టర్ నాగప్రసాద్, డీపీఓ విజయరాజు, జిల్లా ఎపిడమాలజిస్ట్ రమేష్, స్థానిక వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

అతిసారం ప్రబలిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని వెంటనే లక్ష్మీపురంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. తర్వాత కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతన్న బాధితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. అతిసారం ప్రబలడానికి కారణమైన హంద్రీ నదిలోని నీటిని ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. త్వరలోనే లక్ష్మీపురంలో మినరల్ ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అమర జవాన్ స్మారక స్థూపం ఏర్పాటు నిర్ణయంపై హర్షం

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలో రూ. 30 లక్షలు వెచ్చించి అమర జవాన్ స్మారక స్థూపం ఏర్పాటు చేసేందుకు పాలకవర్గం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మాజీ సైనికుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పేరయ్య ఆధ్వర్యంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా మాజీ సైనికుల ఉద్యోగుల స్థూపం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చామని, కమిషనర్ స్పందించి నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఆ సంఘం నాయకులు సుధాకర్, నజీర్ అహ్మద్, వరప్రసాద్‌లు ఉన్నారు.

ఉపాధ్యాయులను వేధించడం తగదు

కర్నూలు సిటీ: పాఠశాలల పర్యవేక్షణ నిబంధనలను తుంగలో తొక్కి వాట్సప్ సమీక్షలతో ఉపాధ్యాయులను వేధించడం తగదని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న అన్నారు. సోమవారం స్థానిక సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కె. జనార్దన్, మహ్మద్ షఫీ, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత నీరాజనం



సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: టూరిజం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఏర్పాటు చేసిన సంగీత నీరాజనం కార్యక్రమం అలరించింది. టూరిజం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడలో డిసెంబర్ 10,11,12 తేదీల్లో జరగబోవు కృష్ణ వేణి సంగీత నీరాజనం మ్యూజిక్ ఫెస్టివల్‌కు ముందస్తు కార్యక్రమాలుగా సంగీత నీరాజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన విదూషి కొత్తపల్లి వందన గాత్రానికి విద్వాన్ కె.వి. కృష్ణ వయొలిన్ (తిరుపతి), విద్వాన్ కోటిపల్లి రమేష్ (తిరుపతి) మృదంగం సహకారం అందించారు. గుంటూరు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ గోవింద రాజులు కార్యక్రమానికి అబ్జర్వర్‌గా వ్యవహరించారు. టూరిజం అండ్ కల్చరల్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ కృపాకర్, విజయ్ సింగ్, జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి విజయ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఇంటిని ముట్టడిస్తాం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : కురువ సుగుణ, లక్ష్మీల నుంచి కమ్మ వెంకటేశ్వర్లు రూ.15 లక్షలు తీసుకొని మోసం చేశారని, బాధితులకు పక్షం రోజుల్లో న్యాయం చేయకపోతే డీఎస్పీ యుగంధర్‌బాబు ఇంటిని ముట్టడిస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. జగన్నాథం హెచ్చరించారు. డీఎస్పీ అండతోనే కమ్మ వెంకటేశ్వర్లు ఆగడాలు సాగిస్తున్నారని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట కురువ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, కురువ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిన కిరణ్‌కుమార్, నాయకులు శేషఫణి, నాయకంటి జయన్న, రుద్రాక్షల ఇందిరాదేవి, శ్రీనివాసులు, కుళ్లాయప్ప, రవికుమార్, భరత్‌కుమార్ ఆచారి, యాట ఓబులేషు, ఎరుకలి రాజు, శ్రీనివాసులు, నాగన్న, మహానంది, లక్ష్మన్న కిరణ్‌కుమార్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంబ్రాయిడరీ వర్క్ శిక్షణ తరగతుల పరిశీలన

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో డబ్ల్యూసీయూఎస్ఎస్ ఆధ్వర్యంలో నాబార్డు ఆర్థిక సహాయంతో హ్యాండ్ ఎంబ్రాయిడరీ వర్క్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ తరగతులకు సోమవారం నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి హాజరయ్యారు. 15 రోజుల పాటు శిక్షణ పొందిన పాదుపు మహిళలు తయారు చేసిన వర్కులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యత

ఓర్వకల్లు: తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి హేమలత అన్నారు. సోమవారం నన్నూరులో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్థానికంగా ఉన్న 4వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అంగన్‌వాడీ పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి, ప్రతి 6 నెలలకు ఒకసారి విటమిన్-ఎ ద్రావణం, పది నెలల వయస్సు నుంచి ఐదు ఏళ్ల పిల్లలకు 9 డోస్‌లు తప్పక ఇప్పించాలని సూచించారు.

బ్రూస్‌లీ జయంతి వేడుకలు

కర్నూలు (టౌన్): నగరంలోని టౌన్ మోడల్ పాఠశాలలో సోమవారం నటుడు బ్రూస్‌లీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూఆర్‌బీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఊట్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో తైక్వాండో క్రీడాకారులు, చిన్నారులు నగరంలో 2 కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కర్నూలు సిటీ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ (టౌన్ మోడల్)లో సోమవారం భారత రాజ్యాంగం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు న్యాయవాది జయరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు భారత రాజ్యాంగం చదవాలని, అందులో ప్రతి ఒక్కరికి బాబాసాహెబ్ హక్కులు కల్పించారన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.